క్లుప్తంగా

అనధికార వలకట్లపై ఆర్డీఓకు ఫిర్యాదు

అల్లవరం: వాసాలతిప్ప, లోయర్ కౌశిక డ్రెయిన్‌పై అనధికారికంగా వలకట్లు ఏర్పాటు చేసి తమ జీవనోపాధికి భంగం కలిగిస్తున్నారని ఎన్.రామేశ్వరం గ్రామానికి చెందిన మత్స్యకారులు ఆర్డీఓ కేశవ వర్ధన్‌రెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. డ్రెయిన్‌ల్లో వలకట్లు ఏర్పాటు చేసేందుకు గ్రామంలో వేలం పాటలు నిర్వహిస్తున్నారని, దీనివల్ల పాటదారుడు మాత్రమే లబ్ధి పొందుతున్నారని మిగిలిన మత్స్యకారులు జీవనోపాధి కరువైపోతుందని పి.సత్యనారాయణ, అంగాడి విష్ణుమూర్తి, మల్లాడి నరేష్ ఆర్డీఓకి తెలిపారు. డ్రెయిన్‌లో వలకట్లు వేయకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ పరిశీలన

ముమ్మిడివరం: మండలంలో గృహ దర్శన కార్యక్రమంలో భాగంగా చినకొత్తలంకలో ఆరోగ్య శాఖ సిబ్బంది నిర్వహిస్తున్న ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను మంగళవారం కోనసీమ జిల్లా వైద్యాధికారి డా.దుర్గారావు దొర పరిశీలించారు. ఈ-కేవైసీ యాప్‌లో గర్భిణుల నమోదు, వారి పిల్లల ఆరోగ్య పరిస్థితులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీసీ సీహెచ్ రామకృష్ణ, ఏపీహెచ్ఎస్ డి.రమేష్, ఏఎన్ఎం ఎస్.ఆదిలక్ష్మి, వలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయవాదుల బైక్ ర్యాలీ

ముమ్మిడివరం: ఏపీ లాండ్ టైట్లింగ్ యాక్ట్-2023ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ ముమ్మిడివరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం రావులపాలెం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బార్ అధ్యక్షులు కేఎల్‌వీ ప్రసాద్, రామాయణం మహేశ్వరరావు, వడ్డి నాగేశ్వరరావు, జి.శ్రీనివాసరావు, ఎం.అలీ హసన్, సి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ యాగం

ముమ్మిడివరం: మార్గశిర మాసం పౌర్ణమిని పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేకేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో గణపతి పూజ, మండపారాధన, చండీ హోమం, పూర్ణాహుతి జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన

కాట్రేనికోన: ఎన్నికలు సమీపిస్తుండటంతో రెవెన్యూ సిబ్బంది ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై(ఈవీఎం) అవగాహన సదస్సును సర్పంచ్ ఓలేటి మంగాదేవి అధ్యక్షతన మంగళవారం చిర్రయానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి సత్యవతి మాట్లాడుతూ ఈవీఎంలపై ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓలేటి నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది అచ్చిబాబు, వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు, వీఆర్‌ఏ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరం పంచాయతీ శ్రీరామనగర్, మట్లపాలెం గ్రామాల్లో రూ.6 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టనున్న సీసీ రహదారుల నిర్మాణానికి ఎంపీపీ రాయుడు సునీత మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షల మేరకు గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.నూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, గండి రామాంజనేయులు, నీలపాల సత్తిబాబు, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీపై ఫిర్యాదు

యానాం: నియోజకవర్గ పరిధిలోని పరంపేటలో సోమవారం రాత్రి పేరంటాలమ్మ వారి ఆలయంలో చోరీ జరిగింది. దీనిపై గ్రామస్తులు యానాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆలయ పూజారి మంగళవారం ఉదయం యథావిధిగా ఆలయం తలుపులు తెరిచి చూసేసరికి రెండు హుండీలు బద్దలుకొట్టి ఉన్నాయని, వాటిలో నగదు సైతం చోరీకి గురైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేయాలని గ్రామస్తులు మెల్లం సంపతరావు, పోతుల శివ, బడుగు బలరాం, విజయ్‌లు పోలీసులను కోరారు.

అక్రమ మద్యం పట్టివేత

యానాం: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు ఎస్ఐ కట్టా సుబ్బరాజు మంగళవారం తెలిపారు. స్థానిక గిరియాంపేట సెంటర్‌లో పల్సర్ బైక్‌పై మద్యం తరలిస్తున్న సంగాడి దుర్గాప్రసాద్, సంగాడి పట్టాభిలను పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.7,500 విలువజేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

అయ్యప్పస్వామికి అర్చన

యానాం: నియోజకవర్గ పరిధిలోని సావిత్రినగర్‌లో 18వ సారి శబరిమల యాత్రకు వెళుతున్న గురుస్వామి మల్లాడి వెంకటగోవిందు నివాసం వద్ద మంగళవారం రాత్రి లక్షనామార్చన పూజ వైభవంగా జరిగింది. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన గురుస్వాములు చెక్కా నూకరాజు, వనమాడి వీర్రాజు, స్వాములు మల్లాడి భీరా స్వామి, రామాడి ఆదినారాయణ పాల్గొన్నారు.



అమలాపురంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, కలెక్టర్ హిమాన్షు శుక్లా



కాట్రేనికోనలో ఆడుదాం ఆంధ్రా పోటీల్లో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



ముమ్మిడివరం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ తదితరులు

ఆడుదాం ఆంధ్రా ఆరంభం

- గ్రామ సచివాలయాల పరిధిలో ప్రారంభమైన క్రీడా పోటీలు
- మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తెద్దామంటూ వక్తల పిలుపు

అమలాపురం టౌన్: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను కలెక్టర్ శుక్లా ప్రారంభించి ప్రసంగించారు. మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులను గుర్తించి వారిని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారుచేద్దామన్నారు. కలెక్టర్ శుక్లాతో పాటు జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణిలు పలు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్సీలు సూర్యనారాయణ రావు, ఇజ్రాయిల్‌లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని సత్తా మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



అల్లవరంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



కొమరగిరిపట్నంలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు



ఎదుర్లంకలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

కాట్రేనికోన: విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంచేందుకు క్రీడలు దోహదపడతాయని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంట సుధాకర్ అధ్యక్షతన జెడ్పీహెచ్ పాఠశాల ఆట స్థలంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా అందరి ఆట అన్నారు. కాట్రేనికోన పీహెచ్‌సీలో వైఎస్సార్ హెల్త్ కార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్‌కుమార్, నడింపల్లి సూరిబాబు, కాశి హనుమంతరావు, నడింపల్లి సూరిబాబు, పాలెపు ధర్మారావు, నాతి సత్యనారాయణ, సంసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: క్రీడలతో మానసిక ఉత్తేజం కలుగుతుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సర్పంచ్ రుద్రరాజు పవిత్ర అధ్యక్షతన గోడిలంక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ప్రారంభించారు. దేవగుప్తంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు అధ్యక్షతన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకుడు పినిపే శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన ఆడుదాం ఆంధ్రా క్రీడలను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు ప్రారంభించారు. అల్లవరం ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ బొమ్ము బాలవేణి అధ్యక్షతన జెడ్పీటీసీ కొనుకు గౌతమి ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రారంభించారు.

ఐ.పోలవరం: మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఎంపీపీ మోర్తరాణి మిరియాం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి ఢిల్లీ నారాయణ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తాళ్లరేవు: స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. తొలిరోజు వాలీబాల్ పోటీల్లో భాగంగా నాలుగు జట్లు పాల్గొనగా మొదటి మ్యాచ్‌లో తాళ్లరేవు-2పై తాళ్లరేవు-1 జట్టు గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో తాళ్లరేవు-4 జట్టుపై తాళ్లరేవు-3 జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఎంపీడీఓ ఎం.అనుపమ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పేరూరు జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, సర్పంచ్‌లు దాసరి అరుణడేవిడ్, రొక్కాల విజయలక్ష్మిలు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు. బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా పోటీలను సర్పంచ్ పెనుమాల సునీత ప్రారంభించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్థానిక గ్రామ సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అధ్యక్షతన జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి, సర్పంచ్‌లు కడిమి చిన్నవరాజు, పెయ్యల రాజ్‌కుమార్, యర్రంశెట్టి రామచంద్రరావు, కుంచే బుల్లియ్య, ఎంపీటీసీ సభ్యులు దొనిపాటి బాలమ్మ, వంగా గిరిజా కుమారి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, అన్నంపల్లి సచివాలయాల పరిధిలో ఎంపీపీ కోలా గంగాభవాని, అనాతవరం సచివాలయ పరిధిలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.రాంబాబు, కమిషనర్ జి.లోవరాజు, వైస్ ఎంపీపీలు పాము నాగవేణి, మట్టపర్తి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత



పేరూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి



గొల్లవిల్లిలో ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ తదితరులు

బీసీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం అధ్యక్షుడు కేతా భాస్కర రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావును సత్కరించారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుంటారని సంఘం పని తీరును ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అభినందించారు. త్వరలో ప్రభుత్వం చేపట్టబోయే బీసీ కులగణనలో బీసీ ఉద్యోగులు తమ వంతు పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు రాజులపూడి సుబ్రహ్మణ్యేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి అల్లుమిల్లి శ్రీనుబాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

వాకర్స్ ఆరోగ్య సంస్థకు అవార్డు



బెస్ట్ మెడికల్ క్యాంప్స్ అవార్డుతో నానిరాజు, సత్యనారాయణరెడ్డి తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సంస్థకు అంతర్జాతీయ స్థాయిలో బెస్ట్ మెడికల్ క్యాంప్స్ అవార్డు-2023 లభించింది. విశాఖపట్టణం ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ హాలులో ఈ నెల 24న జరిగిన 32వ ఇంటర్నేషనల్ వాకర్స్ సదస్సులో అంతర్జాతీయ వాకర్స్ అధ్యక్షుడు డాక్టర్ రవీంద్ర చేతుల మీదుగా ఈ అవార్డును వాకర్స్ ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి అందుకున్నారు. స్థానిక కూచిమంచి అగ్రహారంలోని వాకర్స్ ఆరోగ్య సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన వాకర్స్ సమావేశంలో ఈ అవార్డును సంస్థ అధ్యక్షుడు రుద్రరాజు నానిరాజుకు సత్యనారాయణరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత, కార్యదర్శి నల్లా నరసింహమూర్తి, కోశాధికారి బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

ముమ్మిడివరం: ప్రకృతి వ్యవసాయంతో పేద రైతులకు ఎంతో మేలు కలుగుతుందని డ్వాక్రా ఏపీఎం ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కర్రివానిరేవులో రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ క్రాంతి పథకం సిబ్బంది, మండల సమాఖ్య సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీఎం ప్రసాద్ ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న పద్ధతులు, ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రసాయనాలు వాడటం వల్ల భూసారం నశించిపోతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భావి తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ సీఎస్ఎఫ్ ఏఓ శ్రీనివాస్, సమాఖ్య అధ్యక్షురాలు పద్మావతి, ఎస్ఎఫ్ఏ హేమలత, ఏడుకొండలు, అభిమన్యుడు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కర్రివానిరేవులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ ఏపీఎం ప్రసాద్ తదితరులు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

యానాం: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై, నాయకులపై ఉందని కేంద్ర సమాచార, ప్రసార, మత్స్య, పశు సంవర్ధక శాఖా మంత్రి ఎల్.మురుగన్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక జీవీఎస్ గార్డెన్స్‌లో జరిగిన యానాం బీజేపీ శాఖ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో స్పీకర్ ఆర్.సెల్వం, రాజ్యసభ సభ్యుడు సెల్వ గణపతి, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి సెల్వం సమీక్షించారు.

వంగవీటి రంగా చిరస్మరణీయుడు

ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్

అమలాపురం టౌన్: కాపుల ఐక్యతే తన ఊపిరిగా జీవించిన వంగవీటి మోహన రంగా చిరస్మరణీయుడని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. రంగా వర్ధంతి రోజునే అమలాపురంలో అశువులు బాసిన మరో కాపు నాయకుడు జక్కంపూడి నాగేశ్వరరావు కాపుల అభ్యున్నతికి ఎన్నో ఉద్యమాలు చేశారని వారు గుర్తు చేశారు. వంగవీటి మోహన రంగా, జక్కంపూడి నాగేశ్వరావుల వర్ధంతి సందర్భంగా స్థానిక నల్లవంతెన వద్ద ఉన్న వారి విగ్రహాలకు పూలమాలలు వేసిన నివాళులర్పించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్‌లు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, రాష్ట్ర కాపు రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి, కోనసీమ కాపు జేఏసీ కన్వీనర్ కల్వకొలను తాతాజీ, మట్టపర్తి నాగేంద్ర, జిన్నూరి వెంకటేశ్వరరావు, తోరం గౌతమ్, కల్వకొలను బాబి, కుడుపూడి భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, హరి మనోవికాస దివ్యాంగుల కేంద్రంలో పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. స్థానిక శుభ కలశం వద్ద గల వంగవీటి రంగా విగ్రహానికి జక్కంపూడి కిరణ్, రాష్ట్ర కాపు నాడు వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్, నల్లా అజయ్ తదితరులు పూలమాలలు వేసి నివాళర్పించారు.

అల్లవరం: వంగవీటి మోహన్‌రంగా 35వ వర్ధంతి సందర్భంగా రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో డి.రావులపాలెంలో రంగా విగ్రహానికి జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్ పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి శ్రీరామమూర్తి, కొల్లా బాబ్జి, కొల్లా తమ్మయ్యనాయుడు, నల్లా నాని, కొల్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. అల్లవరం సెంటర్‌లో రంగా విగ్రహానికి శెట్టిబత్తుల రాజబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉప్పలగుప్తం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా 35వ వర్ధంతి సందర్భంగా మండలంలోని గొల్లవిల్లి, విలసవిల్లి, చల్లపల్లి, గోపవరం, వానపల్లిపాలెం గ్రామాల్లో రంగా అభిమానులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విలసవిల్లిలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి రంగా విగ్రహనికి పూలమాలలు వేశారు.



రంగా, నాగేశ్వరరావు విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు నేతలు

ఘనంగా 'వీర్ బాల్ దివస్'

అమలాపురం రూరల్: స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ళ దొరబాబు ఆధ్వర్యంలో వీర్ బాల్ దివస్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జ్ కర్రి చిట్టిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు దూరి రాజేష్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండేటి ఈశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి ఫల, పుష్ప ప్రదర్శన

యానాం: వచ్చే నెల 6 నుంచి 8వ తేదీ వరకూ స్థానిక జీఎంసీ బాలయోగి స్టేడియంలో పుదుచ్చేరి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఫల, పుష్ప ప్రదర్శన 2023-24ను నిర్వహించనున్నట్లు వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ జె.శివసుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెరటి తోటల పెంపకం, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద ఉద్యానవనముల పెంపకం పోటీలను నిర్వహిస్తామన్నారు. 5వ తేదీన స్థానిక ఎస్‌టీపీపీ కళాశాలలో మహిళలకు, విద్యార్థినులకు విడివిడిగా ముగ్గుల పోటీలు, 6వ తేదీన బాలయోగి స్టేడియంలో వంటల పోటీలు జరుపుతామన్నారు. స్టాళ్లలో ప్రదర్శనకు వచ్చే నెల 5వ తేదీ లోపు బాలయోగి క్రీడా ప్రాంగణంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

నూతన కమిటీ సభ్యులకు సత్కారం

తాళ్లరేవు: నూతనంగా పార్టీలో పదవులు పొందిన నాయకులు, కమిటీ సభ్యులను మంగళవారం తాళ్లరేవు క్రీం కాంపౌండ్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు రేవు మల్లీశ్వరి, జిల్లా మహిళా విభాగ కార్యదర్శి పెట్ల శాంతకుమారి, జిల్లా మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి పోతుల రత్నకుమారి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి నీలపాల సత్తిబాబు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మోకా మధుబాబు, జిల్లా విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి పందిరిపల్లి అమర్ శేఖర్, మండల యువజన విభాగం అధ్యక్షుడు మట్టపర్తి లోవరాజు, మండల క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు దడాల సాల్మన్ రాజులను ఎమ్మెల్యే పొన్నాడ దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు, నందికోళ్ల శ్రీమన్నారాయణ, కొల్లు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పని చేయాలి

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. చెయ్యేరు అగ్రహారంలో మంగళవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి అధ్యక్షతన కార్యకర్తల మండల స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విభేదాలకు పోకుండా కలిసి పనిచేస్తే విజయం మనదేనన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలు, నాయకులకు పదవులు ఇచ్చి ప్రత్యేక గుర్తింపు ఇస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్‌కుమార్, నడింపల్లి సూరిబాబు, కాశి హనుమంతరావు, నడింపల్లి సూరిబాబు, పాలెపు ధర్మారావు, నాతి సత్యనారాయణ, సంసాని నాగేశ్వరరావు, నల్లా బేబి జానకి, నల్లా నరసింహమూర్తి పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

తాళ్లరేవు: ఈ నెల 29వ తేదీన ముమ్మిడివరంలో జరిగే వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని టీటీడీ పాలకమండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరారు. జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ స్వగృహం వద్ద వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ అధ్యక్షతన జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 29వ తేదీ ఉదయం 10 గంటలకు మహిపాల చెరువు వద్ద నుంచి ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల వరకూ బస్సు యాత్ర సాగుతుందన్నారు. అనంతరం ఎయిమ్స్ కళాశాల వద్ద సభ జరుగుతుందన్నారు. సమావేశంలో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్ధనరావు, రాయుడు గంగాధర్, కాశి లక్ష్మణస్వామి, రేవు మల్లీశ్వరి, అంకాడి అంజిబాబు, రెడ్డి రెడ్డిబాబు, భూసారపు పద్మారావు పాల్గొన్నారు.



తాళ్లరేవులో పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్